# అపశ్రుతి

వాడికి కళ్ళులేవు.

కాని వాడికి చూపుంది.

వెయిటింగ్ రూము పక్కని ఇనప కటకటాల వారగా వాడు కూచుంటాడు. ముందు ఓ చిరుగుల గోనెపట్ట వుంటుంది. దానిమీద కాన్లూ అర్ధణాలు పడుతుంటే వాటిని చేతితో తడిమి చూసుకుంటాను. వాడికి అవి తెలుస్తాయి. ఎవరైనా బేడకాసు కాని, అణాకాసు కాని వేస్తే వాడు సరిగ్గా చిల్లర చూసి ఇయ్యగలడు. వాడికి రైలు వచ్చే టైములు తెలుసు. సిగ్నల్ ఇవ్వగానే కనిపెడతాడు. రెస్టారెంట్ బల్లలు తుడిచే వెంకటేశాన్ని, కంట్రాక్టర్ రామయ్యగారినీ, స్టేషన్‌మాష్టరునీ, టికెట్ కలెక్టర్ పుల్లారావునీ వాడు చూడకుండానే గుర్తుపట్టగలడు. వాళ్ళ గొంతుకూడా వినకుండా గుర్తుపట్టగలడు. స్టేషన్ మాష్టరు బూటుకాళ్ళు, రామయ్యగారి జైరు చెప్పులూ దూరాన్నించే గుర్తుపడతాడు. వెంకటేశం వాడికి బీడీలు తెచ్చి

ఇస్తాడు. వాడు రైలంటే ఎలాంటిదో చూడకపోయినా వాడు వూహించ గలడు.

రైలు చాల పెద్దదీ, దానినిండా తొక్కిడి తొక్కిడిగా జనంవుంటారు. వాళ్ళంతా యీ స్టేషనులో దిగుతారు. తలావోకానీ, అర్ధణా తనకు వేసి పోతారు. అదీ వాడి అభిప్రాయం. రాత్రి పదకొండున్నరకి చిట్టచివరవచ్చే ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోగానే అప్పలమ్మ వస్తుంది. డబ్బులు లెక్కపెడుతుందీ. అప్పలమ్మ వాడి అమ్మ, వాణ్ణి అక్కణ్ణే వోమూల పక్కపరచి పడుకోబెడు తుంది. మళ్ళీఐదుగంటలకి ప్యాసింజెరుబండి వస్తుంది. రైలు కూతపెట్టగానే వాడికిచప్పున మెళుకవవొస్తుంది. లేచికూచుంటాడు. "అమ్మా కానీ, బాబూ కానీ" అని అరుస్తాడు, "గుడ్డోణ్ణమ్మా, డిక్కులేనివాణ్ణి" అంటాడు. అలా నడుస్తున్నది వాడిజీవితం, అలాగడుస్తున్నది. వాడికి ఆడామగా తేడా తెలీదు. వాడు చాలామాట్లు ఊహకందని లోతులకిదిగాడు. పదిహేనేళ్ళు వెళ్ళిపోయి నప్పటి నుంచీ వాడికదోరకం బాధగావుంది. మొన్న తన ముందర ఎవరో తియ్యగా నవ్వారు. ఎంతో మధురంగా విన్పించింది వాడికి ఆనవ్వు. పక్కనే వెంకటేశం వున్నాడప్పుడు, వెంకటేశాన్ని అడిగాడు వాడు. "ఎవరా నవ్వుకుంటూ పోతున్నది?"

అని. వెంకటేశ్వర్లు అన్నాడు.

"చిలక" వాడికర్థంకాలేదు. చిలక అలా నవ్వుతుంది కాబోలు?

చిలకలట్టా నవ్వుతుంటాయేంటి?

"చిలక కాదురా, చిన్నది"

వాడికి వెంకటేశం చెప్పినది అర్థం కాలేదు.

వెంకటేశం థర్డుఫారందాకా చదువుకున్నాడట. ఎప్పుడో చిన్న ప్పుడు. అప్పుడప్పుడు వెంకటేశం వాడికి అమ్మాయిలను గురించి చెపు తుంటాడు. వాడికేమీ అర్థంకావు ఇప్పుడూ అర్థం కాలేదు. అడిగాడుమళ్ళీ.

"స్టేషన్ మాష్టరు కూతురు, మొగుడొస్తాడట, అందుకని స్టేషన్ కొచ్చింది" వాడు మరేం మాట్లాడలేదు. ఆ అమ్మాయి ఎలా వుండివుంటుందో వూహించగలిగాడు. వాడికి ఆడామగా తేడా వొక్క స్వరభేదమే అనిపిస్తుంది. వాడికంతే. ఇక ఏం తెలీదు. మొగాళ్ళంతా తనలాగే వుంటారు. అయితే వాళ్ళకు కళ్ళు కనపడతాయట. తనకూ కనబడుతూనే వున్నాయి. ఆడోళ్ళంతా అప్పలమ్మలావుంటారు. అదీ వాడిఅభిప్రాయం.

అప్పలమ్మ అన్నది. "అరేయి రామిగా, యీ వూరికి దరమాత్ముడొచ్చాడంట. ఊర్కినే కళ్ళు బాగుసేయిస్తాడంట. సాలమందికి కళ్ళొచ్చినాయంట, మనంకూడా యెల్దాం. భగవంతుడిదయ" అప్పలమ్మ రామిగాణ్ని కావిలించుకుంది. డాక్టరు ఆవూళ్ళో వారంరోజులుంటాడని తెలిసింది అప్పలమ్మకి, రామిగాణ్ని తీసుకపోయి డాక్టరుగారి కాళ్ళమీద పడ్డది. ఆయన పరీక్షించాడు. ఆపరేషన్ చేశాడు. కళ్ళొస్తాయన్నాడు. అప్పలమ్మ బ్రహ్మానంద పడింది. వాడు స్టేషన్ మాష్టరు కూతుర్ని వో సారి చూద్దామనుకున్నాడు. నాలుగురోజులైన తర్వాత వాడికి కట్టువిప్పారు. "ఒకసారిచూడు ప్రపంచాన్ని మళ్ళీ కట్టుకట్టాలి పదిరోజులదాకా తియ్యకూడదు మళ్ళీ" అన్నాడు డాక్టరు. రామిగాడు రెప్పలు పైకెత్తాడు. అప్పలమ్మను చూశాడు. అప్పలమ్మ నేనురా, రామిగా" అన్నదాకా వాడికి అప్పలమ్మ అలా వుంటుందని తెలీలేదు. తరవాత తనని చూసుకున్నాడు. తలదిరిగి డోకొచ్చినంత పనైంది. డాక్టరుగారిని చూశాడు. వాడికో ఊహ మెరిసింది, మనిసంటే అట్టావుండాలి, అనుకున్నాడు. చిరునవ్వు నవ్వుతున్న నర్సుని చూశాడు. ఎందుకో చేతులెత్తి దండంపెట్టాడు. నర్సు తియ్యగా నవ్వింది, "నాక్కాదు" డాక్టరుని చూపించింది. నర్సు నవ్వుతుంటే రామిగాడకి స్టేషన్ మాష్టర్ కూతురు జ్ఞాపకాని కొచ్చింది. చుట్టూ కలయచూశాడు రామిగాడు. చాలామందిపడివున్నారు. నానాభీభత్సంగా

వుంది. కదలవద్దు. కళ్ళు తెరవవొద్దు. పొరపాటునకూడా కళ్ళు నలపకు మళ్ళీ రావు" అన్నాడు డాక్టరు. వెళ్ళిపోయాడు.

రామిగాడికా రాత్రి నిద్రపట్టల తానూహించినట్లుగాలేదు ప్రపంచం నర్సులాగాలేదు అప్పలమ్మ. నర్సుని చూసి తన కదోలా అనిపించిందేం. వెంకటేశం నిన్ను చూట్టానికొచ్చాడు. అమ్మబాబో అతణ్ణి చూస్తేనే భయమేస్తుంది. అంత తియ్యగా మాట్లాడతాడేం, వాడికి స్టేషనూ, చిరుగుల గోనెచాప, రైళ్ళ రాకపోకలు మనసులో కదిలాయి. వాడు కాసేపు యేడ్చాడు. అప్పలమ్మ నిద్రపోతున్నది కళ్ళు గట్టిగా నలుపుకున్నాడు. వాడికళ్ళు పోయినయ్. వాడికి చూపువచ్చింది.

-00000-